## ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 22-08-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- దేశ తూర్పు సరిహద్దు భద్రతపై హోంమంత్రి అమిత్ షా కేంద్ర బలగాలతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు.
- సకాలంలో తీర్పులు ఇచ్చే న్యాయవ్యవస్థ పెట్టుబడులకు విశ్వసనీయతను పెంచుతుందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ తెలిపారు.
- విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్.జైశంకర్ రేపటి నుంచి రెండు రోజుల పాటు రష్యాలో అధికారికంగా పర్యటించనున్నారు.
- వైద్య రంగాన్ని ఆధునిక సాంకేతికతతో అనుసంధానించడం అవసరమని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఉద్ఘాటించారు.

= = = = = = = = = = = = = = = = = = =

దేశ తూర్పు సరిహద్దు భద్రత, వ్యూహాత్మకంగా అత్యంత కీలకమైన సిలిగురి కారిడార్ వద్ద భద్రతను మరింత కట్టుదిట్టం చేయడంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా పశ్చిమ బెంగాల్ ఉన్నతాధికారులు, కేంద్ర బలగాల ప్రతినిధులతో ఈరోజు సమావేశం నిర్వహించారు. పశ్చిమ బెంగాల్ పర్యటనలో భాగంగా చివరి రోజు సుక్నా వేదికగా నిర్వహించిన ఈ సమావేశంలో బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్), సశస్త్ర సీమా బల్ (ఎస్ఎస్‌బీ) అధికారులు పాల్గొన్నారు. సరిహద్దు నిఘాను మరింత పటిష్టం చేయడం, కేంద్ర భద్రతా బలగాలు, నిఘా వర్గాలు, రాష్ట్ర పోలీసులు, యంత్రాంగం మధ్య సమన్వయాన్ని మెరుగుపరచడంపై సమావేశంలో చర్చించారు. అలాగే, ప్రతిపాదిత 'త్రికోణ భద్రతా గ్రిడ్' (Triangular Security Grid) ఏర్పాటుకు సంబంధించి ఒక సమగ్ర ప్రణాళికను రూపొందించడంపై చర్చించారు.

= = = = = = = = = = = = = = = = = = =

భారత విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్.జైశంకర్ రేపటి నుంచి రెండు రోజుల పాటు రష్యాలో అధికారికంగా పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన ఇండియా-రష్యా అంతర్ ప్రభుత్వ కమిషన్ 27వ సమావేశానికి సహాధ్యక్షత వహించనున్నారు. ఈ సమావేశంలో వాణిజ్యం, ఆర్థిక, శాస్త్రీయ, సాంకేతిక, సాంస్కృతిక రంగాల్లో ద్వైపాక్షిక సహకారంపై చర్చలు జరగనున్నాయి. ఈ పర్యటనలో భాగంగా రష్యా విదేశాంగ మంత్రి సెర్గే లావ్ రోవ్ తో జైశంకర్ సమావేశం కానున్నారు.

= = = = = = = = = = = = = = = = = = =

'సమాధాన్ సమారోహ్' కార్యక్రమంలో భాగంగా మూడు రోజుల ప్రత్యేక లోక్‌అదాలత్ లో పెండింగ్‌లో ఉన్న 400లకు పైగా కేసులను మొదటి రోజు పరిష్కరించినట్లు సుప్రీంకోర్టు వెల్లడించింది. ఇందులో ప్రధానంగా భార్యాభర్తల

వివాదాలు, ఆస్తి తగాదాలు, మోటారు వాహన ప్రమాద నష్టపరిహార కేసులు, భూసేకరణ-పరిహార కేసులు, పన్ను వివాదాలకు సంబంధించిన కేసులు ఉన్నాయి. సయోధ్య, మధ్యవర్తిత్వం వంటి ప్రత్యామ్నాయ వివాద పరిష్కార మార్గాలను ప్రోత్సహించేందుకు ఈ ప్రత్యేక కార్యక్రమం దోహదపడుతుందని సుప్రీంకోర్టు తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = =

వైద్య రంగాన్ని ఆధునిక సాంకేతికతతో అనుసంధానించడం అవసరమని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఉద్ఘాటించారు. ఉత్తరప్రదేశ్‌లోని నొయిడాలో నూతనంగా ఏర్పాటు చేసిన ఒక ల్యాబ్ సదుపాయాన్ని ప్రారంభించిన అనంతరం రాజ్‌నాథ్ సింగ్ ఈ వ్యాఖ్యలు చేశారు. గత పన్నెండేళ్లలో దేశంలో వైద్య సదుపాయాలు గణనీయంగా విస్తరించాయని ఆయన పేర్కొన్నారు. ఆరోగ్యవంతమైన, సమర్థవంతమైన భారతదేశాన్ని నిర్మించడం ద్వారా 'వికసిత్ భారత్' లక్ష్యం సాధ్యపడుతుందని తెలిపారు. సాయుధ బలగాల వైద్య సేవల (Armed Forces Medical Services) విభాగంలోనూ ప్రభుత్వం కొత్త సాంకేతికత లను ప్రవేశపెడుతోందని రక్షణమంత్రి ఈ సందర్భంగా వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = =

న్యాయవ్యవస్థ సకాలంలో సత్వర తీర్పులు ఇవ్వగలిగితే ప్రపంచవ్యాప్తంగా విశ్వాసం పెరుగుతుందని, సులభతర వాణిజ్యానికి ప్రోత్సాహం లభిస్తుందని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. దీనివల్ల పెట్టుబడులు పెట్టడానికి, ఆర్థిక వృద్ధి సాధించడానికి ఆ దేశం మరింత నమ్మదగినదిగా మారుతుందని ఆయన పేర్కొన్నారు. ఢిల్లీలో ఈరోజు జరిగిన 11వ బ్రిక్స్ లీగల్ ఫోరమ్‌లో మాట్లాడుతూ, చట్టబద్ధమైన పాలన పట్ల నిబద్ధతతో పనిచేసే న్యాయ వ్యవస్థ ఏ దేశ ఆర్థిక పురోగతికైనా మూలస్తంభాలని ఉద్ఘాటించారు. కోర్టులు వేగంగా, విశ్వసనీయంగా తీర్పులు ఇవ్వడం వలన దేశం పెట్టుబడిదారుల నమ్మకాన్ని పెంచుతుందని జస్టిస్ సూర్యకాంత్ పేర్కొంటూ...

(వాయిస్…26 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

విశాఖపట్నం వేదికగా జరుగుతున్న బ్రిక్స్ (BRICS) సదస్సులో భాగంగా యువజన మంత్రుల సమావేశం ఈరోజు ముగిసింది. ఈ సమావేశంలో 'బ్రిక్స్ యువజన మంత్రుల సంయుక్త ప్రకటన' ను అధికారికంగా ఆమోదించారు. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖా మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బ్రిక్స్ దేశాల మధ్య యువజన సహకారంలో సాధించిన ప్రగతిని సమీక్షించడంతో పాటు, విద్య, నైపుణ్యాలు, పారిశ్రామికవేత్తలుగా ఎదగడం, నూతన ఆవిష్కరణలు, సామాజిక అభివృద్ధి రంగాల్లో యువతకు మరిన్ని అవకాశాలను విస్తరించే మార్గాలపై చర్చించారు.

= = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా నెల రోజుల పాటు 'సేవా సంకల్ప్ అభియాన్' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు భారతీయ జనతా పార్టీ (BJP) తెలిపింది. ప్రజలకు సేవ చేయడంలో ప్రధాని మోదీ అంకితభావాన్ని చాటిచెప్పడంతో పాటు, ముఖ్యంగా యువతను సేవా కార్యక్రమాలలో భాగస్వామ్యం చేసేలా ప్రోత్సహించడమే ఈ అభియాన్ ప్రధాన ఉద్దేశమని వెల్లడించింది. ఢిల్లీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వినోద్ తావ్డే ఈ వివరాలను వెల్లడించారు. అక్టోబర్ 7, 2001న గుజరాత్ ముఖ్యమంత్రిగా నరేంద్రమోదీ మొదటిసారి ప్రమాణ స్వీకారం చేసి 25 ఏళ్లు పూర్తవుతున్న సందర్భాన్ని కూడా పురస్కరించుకుని ఈ ప్రచారం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. అంతకుముందు నిర్వహించిన బీజేపీ జాతీయ కార్యశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సంఘటన ప్రధాన కార్యదర్శి మధుకర్, మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ పాల్గొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = =

సోమాలియా, యెమెన్ తీర ప్రాంతాల సమీపంలో సముద్రపు దొంగలు అపహరించిన రెండు విదేశీ వాణిజ్య నౌకల్లోని 22 మంది భారతీయ నావికుల భద్రతపై భారత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ వ్యవహారంపై సోమాలియా అధికారులతో భారత ప్రభుత్వం సంప్రదింపులు జరిపింది. ఎంటీ సిబు (MT Sibu) నౌకలో 16 మంది, ఎంవీ

లూతుఫ్ (MV Lutuf) నౌకలో ఆరుగురు చొప్పున మొత్తం 22 మంది భారతీయ నావికులు ఈ వేర్వేరు ఘటనల్లో బందీలుగా చిక్కుకున్నారు. అపహరణకు గురైన భారతీయ నావికులందరూ సురక్షితంగా ఉన్నట్లు కెన్యాలోని భారత హైకమిషన్ సామాజిక మాధ్యమం వేదికగా వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = =

టెలివిజన్ ఛానెళ్లలో ప్రసారమయ్యే వాణిజ్య ప్రకటనల నిడివిపై ఇప్పటివరకు ఉన్న 12 నిమిషాల గరిష్ఠ పరిమితిని కేంద్ర ప్రభుత్వం తీసివేసింది. ఇందుకు సంబంధించి కేబుల్ టెలివిజన్ నెట్‌వర్క్స్ రూల్స్-1994 సవరణలకు కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయడంతో ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వచ్చింది. డిజిటల్ మాధ్యమాలలో ఇలాంటి ప్రకటనల నిబంధనలు ఏవీ లేనందున, సాంప్రదాయ టీవీ ఛానెళ్లకు మార్కెట్‌లో ఎదురవుతున్న పోటీని తొలగించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రిత్వ శాఖ వివరించింది.

= = = = = = = = = = = = = = = = = = =

పంజాబ్‌లో భారత సైన్యం అత్యాధునిక డ్రోన్లతో కూడిన తొలి బాజ్ బెటాలియన్‌ను ఏర్పాటు చేసింది. యుద్ధభూమిలో గగనతల చురుకుదనం, అత్యవసర స్పందన సామర్థ్యం పెంచడమే దీని లక్ష్యం. పంజాబ్ రక్షకులుగా పేరుగాంచిన సైన్యానికి చెందిన వజ్ర కార్ప్స్ (11వ కార్ప్స్) ఈ బాజ్ బెటాలియన్‌ను అధికారికంగా ప్రారంభించిన తొలి విభాగంగా నిలిచింది.

= = = = = = = = = = = = = = = = = = =

దేశంలోకి విదేశీ మారకద్రవ్యాన్ని పెంచేందుకు భారత రిజర్వ్ బ్యాంక్ ప్రవేశపెట్టిన యూఎస్ డాలర్-ఇండియన్ రూపాయి (USD-INR) ఫారెక్స్ స్వాప్ సౌకర్యానికి విశేష స్పందన లభిస్తోంది. ఈ నెల 21వ తేదీ నాటికి ఈ సదుపాయం ద్వారా 72.85 బిలియన్ అమెరికన్ డాలర్ల విదేశీ మారకద్రవ్యం దేశానికి చేరినట్లు ఆర్‌బీఐ వెల్లడించింది. రూపాయి మారకం విలువ బలహీనపడుతున్న తరుణంలో డాలర్ల రాకను వేగవంతం చేసేందుకు ఆర్‌బీఐ జూన్ 8న ఈ ప్రత్యేక ఫారెక్స్ స్వాప్ సౌకర్యాన్ని ప్రారంభించింది.

= = = = = = = = = = = = = = = = = = =

ఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియం వేదికగా జరుగుతున్న బ్యాడ్మింటన్ వరల్డ్ ఛాంపియన్ షిప్ లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ట్రీసా జాలీ, గాయత్రి గోపీచంద్ జోడీ కాంస్య పతకం సాధించింది. మహిళల డబుల్స్ సెమీఫైనల్స్ పోరులో డిఫెండింగ్ ఛాంపియన్లయిన చైనా జోడీ లీయు షెంగ్ షు (Liu Sheng Shu), టాన్ నింగ్ (Tan Ning) చేతిలో పరాజయం పాలైనప్పటికీ.. భారత జంట చారిత్రాత్మక కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది.

= = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రచారం చేస్తున్నట్లుగా సామాజిక మాధ్యమాలలోని వస్తున్న ఒక నకిలీ పెట్టుబడి పథకం వీడియోను ప్రభుత్వం ఖండించింది. 22వేల రూపాయలు పెట్టుబడి పెడితే వారానికి 5 లక్షల 50 వేల రూపాయల ఆదాయం వస్తుందనే హామీ ఇస్తున్నట్లు వీడియో ప్రచారం అవుతోంది. ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (PIB) ఫాక్ట్ చెక్ యూనిట్ ఈ వీడియో పూర్తిగా నకిలీదని స్పష్టం చేసింది.

= = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = =